క్లుప్తంగా

ఖానాపూర్ ఎమ్మెల్యేను కలిసిన మాజీ జెడ్పీటీసీ


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బక్షినాయక్

జన్నారం: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును హైదరాబాద్‌లో మాజీ జెడ్పీటీసీ బక్షినాయక్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం జన్నారం మండల సమస్యలు, చేపట్టబోయే అభివృద్ధిపై చర్చించినట్లు మాజీ జెడ్పీటీసీ బక్షినాయక్ తెలిపారు.

తాగునీటి సమస్య తీర్చాలని వినతి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో తాగునీటి సమస్య తీర్చాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ శనివారం వినతిపత్రం అందించారు. వేసవి కాలం రాకముందే పలు కాలనీల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ప్లేట్లు పంపిణీ


విద్యార్థులకు ప్లేట్లు అందిస్తున్న మున్సిపల్ కమిషనర్, పూర్వవిద్యార్థులు

మందమర్రిరూరల్: పట్టణంలోని ఒర్రెగడ్డ ఏరియాలో గల జెడ్పీహెచ్ఎస్ (బాయ్స్) విద్యార్థులకు అదే పాఠశాలలో 1991–92 బ్యాచ్ పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శనివారం 200ల ప్లేట్లను విరాళంగా అందించారు. మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, ఇంజినీర్ అచ్యుత్ వీటిని పంపిణీ చేశారు. పూర్వవిద్యార్థులు అంతడుపుల నాగరాజ్, రాయలింగు, పవన్, రమేశ్, శ్రీనివాస్, నరేశ్, యోగానంద్, పార్వతి విజయ, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

నిమోనియాపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అనిత

నస్పూర్: నస్పూర్ పీహెచ్‌సీలో నిమోనియ గుర్తింపు, లక్షణాలు, నివారణ చర్యలపై సిబ్బందికి జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ అనిత శనివారం అవగాహన కల్పించారు. ఈనెల 18 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 29 తేదీ వరకు నిమోనియాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అనిత తెలిపారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సమత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌హై ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి హాజరయ్యే శాఖల అధికారులు తాజా నివేదికలతో రావాలని సూచించారు. ఎంపీటీసీలు, సర్పంచులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

నాయీబ్రాహ్మణ సేవా నూతన కార్యవర్గం

పాతమంచిర్యాల: పట్టణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విష్ణుభక్తుల సదానందం, ప్రధాన కార్యదర్శిగా చిలువేరు పున్నం, ఉపాధ్యక్షులుగా సిలువేరు శంకర్, కంది సత్యనారాయణ, ముత్యాల సదానందం, ఎం.సాయిప్రసాద్, కార్యదర్శిగా కంది నర్సింహులు ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుగా మందపెల్లి బుచ్చన్న, గౌరవ అధ్యక్షుడిగా కొదురుపాక దత్తు, కోశాధికారిగా కంది నర్సింహులు, ప్రచార కార్యదర్శిగా సముద్రాల మల్లేశ్ తోపాటు మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రమాదాలకు నిలయంగా ఎన్‌హెచ్–63

- జాతీయ రహదారికి ఇరువైపులా ముళ్ల, చెట్లపొదలు
- గుంతలతో స్థానికుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు


ముల్కల్లలో జాతీయ రహదారిపై రక్షణ లేకుండా ప్రమాదకరంగా కల్వర్టు


వేంపల్లి శివారులో జాతీయ రహదారిపైకి ముళ్ల, చెట్లపొదలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి నుంచి ముల్కల్ల, రాపల్లి, హాజీపూర్, దొనబండ వరకు ఉన్న జాతీయ రహదారి అస్తవ్యస్తంగా మారింది. అసలు ఇది జాతీయ రహదారేనా అన్నచందంగా మారింది. ఓ వైపు శాఖ అధికారులు అసలు పట్టింపు లేకుండా మాకేందుకులే అనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అడ్డదిడ్డంగా మారిన జాతీయ రహదారి వ్యవస్థ వివరాలు ఇలా ఉన్నాయి.. హాజీపూర్ మండలంలోని జాతీయ రహదారి 63 అధ్వానంగా మారింది. వేంపల్లి శివారు నుంచి మొదలు ముల్క ల్ల వరకు ఉన్న జాతీయ రహదారి మొత్తంగా ఇరుకుగా మారింది. రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున ముళ్ల, చెట్ల పొదలు పెరిగిపోయి రహదారిపైకి వచ్చాయి. రాకపోకలు సాగించేవారికి ఇబ్బందులు మొదలయ్యాయి. ఎప్పుడేం ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి. ముళ్ల, చెట్లపొదలతో రోడ్డు ఇరుగ్గా మారి వాహనాలు పక్కపక్క నుంచి వెళ్తున్నాయి. ఇక మూలమలుపుల వద్ద అయితే ఈ పొదలతో రోడ్లతోపాటు వాహనాలు కనిపించని దుస్థితి. ఎప్పుడు ఏ వాహనం ఢీ కొని ఎలాంటి ప్రమాదాలు తీసుకొస్తాయో తెలియడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

మరమ్మతు చేపట్టాలి


ముల్కల్ల జాతీయ రహదారిపై ఉన్న ప్రమాదకర గుంతతో రోజూ ఒక ప్రమాదం జరుగుతోంది. ద్విచక్రవాహనదారులు కింద పడి గాయలవుతున్నాయి. అధికారులు రోడ్డుకు మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

– కోట శ్రీనివాస్, ముల్కల్ల

గుంతలు పూడ్చాలి


జాతీయ రహదారిపై ఏపుగా పెరుగుతున్న పొదలతో వాహనదారులు పరేషాన్ అవుతున్నారు. చెట్లు మరీ పెద్దగా పెరిగి మూలమలుపుల వద్ద రోడ్డు కనపడడం లేదు. అధికారులు స్పందించి రోడ్లు విశాలంగా మార్చి గుంతలు పూడ్చివేయాలి.

– బోయిని రంజిత్, ముల్కల్ల

మిషన్ భగీరథ గుంత ఇక్కట్లు

హాజీపూర్‌లో మిషన్ భగీరథ పైప్‌లైన్ జాతీయ రహదారిపై నుంచి రోడ్డుకు మరోవైపుగా వేసేందుకు గుంత తీశారు. పైప్‌లైన్ వేసిన తర్వాత పూడ్చాల్సిన గుంతను నిర్లక్ష్యంగా మూసివేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో పరిస్థితి గమనించి జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప–శ్రీనివాసరావు దంపతులు సొంత ఖర్చులతో గుంతను సిమెంట్, కంకరతో మూసి వేయించారు. చాలారోజుల క్రితం చేసిన మరమ్మతు కావడంతో తాజాగా ఆ గుంత వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. ఇప్పటికే ముల్కల్ల సర్పంచ్ మంచాల శ్రీనివాస్ ఈ గుంత కారణంగా కారుతో పల్టీలు కొట్టి మరీ ప్రమాదానికి గురికాగా, దాదాపు పదుల సంఖ్యలో గాయపడి అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డారు. గత ఆదివారం అర్ధరాత్రి మెట్‌పల్లికి చెందిన ఓ వ్యక్తి ఈ గుంత కారణంగా తీవ్ర గాయాలయ్యాడు. ఏది ఏమైనా మండలంలోని జాతీయ రహదారి మొత్తం అధ్వానంగా మారగా వేంపల్లి, శివారులో మాత్రం ప్రమాదాలను తలపించేలా మారింది. రహదారుల శాఖ ఈ రోడ్డు మరమ్మతుతోపాటు రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ల, చెట్లపొదలు తొలగించేలా చూడాలని పలువురు కోరుకుంటున్నారు.

నత్తనడకన పనులు


కంకరతేలిన సీఎస్‌ఐ రోడ్డు

- రోడ్డు నిర్మాణంలో జాప్యం
- రాకపోకలకు ఇబ్బంది
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

లక్సెట్టిపేట: పట్టణంలోని బస్టాండ్ నుంచి వేయాల్సిన రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ దారి గుండా రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణానికి టీఎఫ్ఐడీసీ నిధులు రూ.2.25 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే, సెప్టెంబర్‌లో పాత రోడ్డును తవ్వి కొన్నిరోజులు అలాగే వదిలేశారు. తర్వాత కొంత పనులు చేపట్టారు. ఎన్నికల కోడ్ ఉందని పనులు నిలిపివేశారు. ప్రధాన రహదారి గుండా బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు ఇతర విద్యాసంస్థలకు విద్యార్థులు వెళ్లాల్సి ఉంటోంది. అదేవిధంగా నిత్యం వందలాది మంది ప్రజలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తున్నారు. పనులు ఆపివేయడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.

పనుల్లో జాప్యం

మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి 1170 మీటర్ల పొడవు కొంతమేర బీటీ, కొంతమేర 24 ఫీట్ల వెడల్పుతో సీసీ రోడ్డు వేసి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందులో బీటీ రోడ్డు వేశారు. లైట్లను ఏర్పాటు చేయలేదు. 670 మీటర్ల సీసీ రోడ్డు పనులు కొంత వేశాక ఎన్నికల కోడ్ ఉందని నిలిపివేశారు. రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుండడంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. నిత్యం పాఠశాలల విద్యార్థులు బస్సులు అటు వెళ్లడానికి, కంకర రోడ్డుపై నడవడానికి ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే పట్టించుకుని రోడ్డు పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు పనులు పూర్తిచేయాలి


దసర పండుగకు ముందుగా రోడ్డు తవ్వి అలాగే ఉంచారు. బీటీ వేస్తామని ప్రస్తుతం సీసీ రోడ్డు వేస్తున్నారు. కంకర రోడ్డుపై నడవడానికి ఇబ్బందిగా ఉంది. అధికారులు రోడ్డు పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలి.

– శ్రీకాంత్, లక్సెట్టిపేట

చర్యలు తీసుకుంటాం

కొన్ని కారణాలతో రోడ్డు పనుల్లో జాప్యం జరిగింది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు పూర్తిచేస్తాం. సీసీ రోడ్డు కాగానే విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి పనులు వేగవంతానికి చర్యలు తీసుకుంటాం.

– రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్

రాజకీయ జోక్యంతో అప్పుల్లో సింగరేణి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

కాసిపేట: సింగరేణిలో రాజకీయ జోక్యంతో సంస్థ రూ.29 వేల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని, దీనికి బీఆర్ఎస్, గుర్తింపుసంఘం టీబీజీకేఎస్‌దే బాధ్యత వహించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిపై శనివారం వారు గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. గత పదేళ్లుగా టీబీజీకేఎస్ సంఘం యాజమాన్యానికి కార్మికుల హక్కులు తాకట్టు పెట్టడంతో అడిగేవారు లేకుండా పోయారన్నారు. ఎల్లప్పుడు కార్మికుల సంక్షేమం హక్కుల కోసం పోరాడుతున్న ఏఐటీయూసీని ఎన్నికల్లో కార్మికులు గెలిపించాలని కోరారు. సమావేశంలో డెప్యూటీ జనరల్ సెక్రెటరి ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, బ్రాంచి ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామితోపాటు కొత్తపల్లి నర్సయ్య, నాయకులు సుభాష్‌చంద్రబోస్, బొడ్డుల వెంకటేశ్, శ్రీనివాస్, సీలయ్య, రాజకొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతం చేయాలి


చలో ఢిల్లీ కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చెన్నూర్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఈనెల 21న తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి తగరం మధురాజ్ కోరారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో చలో ఢిల్లీ కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి బీజేపీ మాటతప్పిందన్నారు. గత నెలలో హైదరాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణ విషయంపై స్పష్టత ఇవ్వలేదన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించకపోవడం శోచనీయమన్నారు. పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధించుకుందామని తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రావణ్, మండల అధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు శేఖర్, లచ్చన్న, శ్రీధర్, రాజు పాల్గొన్నారు.

ఊర చెరువు హద్దుల కోసం సర్వే


సర్వే చేస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

భీమారం: మండల కేంద్రం బస్టాండ్ సమీపంలో 570 సర్వేనెంబర్‌లో గల ఊర చెరువు హద్దుల కోసం ఇరిగేషన్ శాఖ డీఈఈ శారద, రెవెన్యూ అధికారులు కలిసి శనివారం సంయుక్తంగా సర్వే నిర్వహించారు. గతంలో జిల్లా కలెక్టర్ భారతిహోళీకేరి సైతం అప్పట్లో ఆమె స్వయంగా సర్వే చేయించారు. అయితే తిరిగి ఇప్పుడు సర్వే చేస్తుండటంపై ఇరిగేషన్ డీఈఈ విలేకరులతో మాట్లాడారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఊర చెరువు విస్తీర్ణం ఉందా తగ్గిందా అనేది తెలుసుకుని హద్దురాళ్లు వేసేందుకు సర్వే చేయిస్తున్నామని అన్నారు. పూర్తిస్థాయిలో సర్వే అనంతరం కట్ట నిర్మించేందుకు ప్రతిపాదనలు చేస్తున్నామని తెలిపారు. కాగా స్థానికులతో ఇబ్బందులు ఎదురైతే ఎదుర్కొనేందుకు పోలీసుల బందోబస్తు మధ్య సర్వే కొనసాగింది.

కొనసాగుతున్న బడిబయటి పిల్లల సర్వే


ఎసన్‌వాయిలో సర్వే చేస్తున్న సీఆర్పీలు

కోటపల్లి: మండలంలో బడిబయటి పిల్లల సర్వే కొనసాగుతోంది. ఈనెల 11 నుంచి వచ్చే నెల 10 వరకు బడిబయట ఉన్న పిల్లలను గుర్తించడానికి సర్వేను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎసన్‌వాయిలో సీఆర్పీలు ఇంటింటికి వెళ్లి సర్వే చేశారు. పిల్లలను గుర్తించి వివరాలను విద్యాశాఖ పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. సీఆర్పీ సంపత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మంచిర్యాలక్రైం: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ మంచిర్యాల కౌన్సిల్ సభ్యుడు న్యాయవాది ఎండీ సమ్దాని అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎస్సీ పోస్ట్‌మెట్రిక్ వసతి గృహంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సామాన్య ప్రజలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా న్యాయ సలహాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ వసతి గృహాల అధికారి రవీందర్‌రెడ్డి, ఏఎస్‌డబ్ల్యూఓ రవీందర్, హెచ్‌డబ్ల్యూవో కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకుసాగాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేందర్


భీమిని: విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు


కాసిపేట: మాట్లాడుతున్న ఎంపీడీవో అలీం


జన్నారం: మాట్లాడుతున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకుసాగితే విజయం సాధిస్తారని ఎంపీడీవో రాజేందర్, ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బెల్లంపల్లిలోని బజారు ఏరియా జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువులో ఉన్నతంగా రాణించాలన్నారు. తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలన్నారు. ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భీమిని: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా ప్రయత్నించాలని భీమిని, కన్నెపల్లి మండలాల ఎంపీడీఓలు జవహర్ రాధాకిషన్ అన్నారు. అడిషనల్ కలెక్టర్ రాహుల్ ఆదేశాల మేరకు భీమిని జెడ్పీఎస్ఎస్, కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ జెడ్పీఎస్ఎస్ పాఠశాలల్లో శనివారం కెరీర్ గైడెన్స్ కౌన్సెలింగ్ నిర్వహించి మాట్లాడారు. విద్యార్థి దశలో డాక్టర్, ఇంజనీర్, ఐఏఎస్, ఐపీఎస్, మనకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని లక్ష్యం వైపు దృష్టి సారించాలన్నారు. ఎంపీవో సబ్దర్‌ఆలీ, ఏఈపీఆర్ రాంచందర్, ఏపీఓ భాస్కర్‌రావు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన్నారం: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంఈవో విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పేరేంట్స్, టీచర్స్, కేరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందశాతం ఉతీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఎంపీడీవో అరుణరాణి, రేంజ్ అధికారి హాఫీజొద్దీన్, హెచ్‌ఎం రామన్న, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నస్పూర్: విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీసీసీ నస్పూర్ ఎస్సై సంతోష్ పేర్కొన్నారు. తీగల్‌పహడ్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం పేరేంట్ టీచర్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రమేశ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సమత, పాఠశాల హెచ్‌ఎం రామన్నలు హాజరై విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: కాసిపేట జెడ్పీ పాఠశాలలో శనివారం 9,10వ తరగతుల విద్యార్థులు, తల్లిదండ్రులకు శనివారం కెరీర్ గైడెన్స్ కౌన్సెలింగ్ నిర్వహించారు. వివిధ అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. ఎంపీడీవో ఎంఏ అలీం, వైద్యాధికారి రవికిరణ్, కాసిపేట ఎస్సై గంగారాం, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సాంబమూర్తి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జైపూర్: విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత స్థానానికి చేరుకుంటారని ఎంపీడీవో సత్యనారాయణ, హైస్కూల్ హెచ్‌ఎం అలీస్ మాధుర్య తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 9వ, 10త తరగతి విద్యార్థులకు భవిష్యత్ ప్రణాళికపై మార్గదర్శకం కోసం శనివారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలని, వాటి సాధనకు కృషి చేయాలన్నారు. ఎస్సై నాగరాజు, డిప్యూటీ రేంజర్ సాగరిక, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్, ఎంపీపీ రమాదేవి, స్థానిక సర్పంచ్ ఆసంపల్లి సువర్ణరాజమల్లు, ఎంపీటీసీ రామటెంకి లింగస్వామి పాల్గొన్నారు.

తల్లిదండ్రులు సహకారం అందించాలి

కోటపల్లి: విద్యార్థులు అనుకున్న లక్ష్యాలు సాధించి గొప్పగా ఎదగడానికి తల్లిదండ్రుల సహకారం అందించాలని సెక్టోరియల్ అధికారి సత్యనారాయణమూర్తి అన్నారు. పార్‌పల్లి ఉన్నతపాఠశాలలో హెచ్‌ఎం యోగేశ్వర్ అధ్యక్షతన శనివారం ఉన్నత చదువులు, వివిధ పోటీ పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంపీడీవో భాస్కర్, ఎంఈవో తిరుపతిరెడ్డి, మెడికల్ ఆఫీసర్ సత్యనారాయణ, డీఈ బద్రీనాథ్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలు నిజం చేయండి


విద్యార్థులకు మోటివేషన్ చేస్తున్న రాజేంద్ర బొల్లా

జన్నారం: తల్లిదండ్రులు కలలను విద్యార్థులు నిజం చేసి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ రాజేంద్ర బొల్లా అన్నారు. మండల కేంద్రంలో రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం మోటివేషనల్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, యాజమన్యాలు రాజేంద్రను సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్, కరస్పాండెంట్ సంపత్‌కుమార్, రాఘవేంద్ర పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా పోరాటం

పాతమంచిర్యాల: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, అనుబంధ సంఘాల జిల్లా ఇన్‌చార్జి గుండా థామస్ అన్నారు. జిల్లాకేంద్రంలో సంఘం నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్గీకరణ కోసం ఉద్యమిస్తున్న వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణకు అండగా నిలువాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శనిగారపు మురళి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి


పరేడ్‌లో పాల్గొన్న పోలీసులు

మందమర్రిరూరల్: శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని మందమర్రి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి సూచించారు. మందమర్రి పోలీస్‌స్టేషన్ ఆవరణలో సిబ్బందితో శనివా రం వారాంతపు పేరేడ్ చేయించారు. కొత్తగా ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టులో వారు వాలీబాల్ ఆడారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీసులు వ్యక్తిగత క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. మందమర్రి ఎస్సై చంద్రకుమార్, రామకృష్ణాపూర్ అదనపు ఏఎస్సై తానాజీ, దేవాపూర్ ఎస్సై అంజనేయులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల: 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గంటల నుండి రాత్రి 8.00 గంటల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899